క్లుప్తంగా

నకిరేకల్ ఎంపీడీఓగా రమేష్ దీన్‌దయాళ్



ఎంపీడీఓను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : కే.రమేష్ దీన్‌దయాళ్ నకిరేకల్ ఎంపీడీఓగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎంపీడీఓగా పనిచేస్తున్న అండాలు మాడ్గుల పల్లి మండలానికి బదిలీ ఆయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్‌ను ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి సత్కరించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



శాబ్దుల్లాపురంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి

కనగల్: త్వరలో రాష్ట్రంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు గాను గురువారం మండల పరిధిలోని దోరెపల్లి, లింగాలగూడెం, పగిడిమర్రి, శాబ్దుల్లాపురం, రేగట్టె, కురంపల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆవాస గ్రామాల్లో సైతం పోలింగ్ బూత్‌లను పెట్టేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జనవరి 1వ తారీఖు నుంచి కొత్తగా ఓటరు నమోదుతోపాటు తప్పుల సవరణలు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ తబిత, సర్వేయర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కారింగు రవి, ఫీల్డ్ అసిస్టెంట్ సురవరం నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న కేవీపీఎస్ సమావేశం

నల్లగొండ టౌన్ : కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 18న సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కురుపాటి సుదర్శన్

చండూరు : మాదిగలకు జనాభా ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్ పిలుపునిచ్చారు. గురువారం చండూరులో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన దేశ రాజధాని నడిబొడ్డున జంతర్‌లో మహాధర్నా, 19న పార్లమెంట్ ముట్టడి చేపడతామని తెలిపారు. 2014 ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ.. కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టి ఆమోదిస్తామని చెప్పిందన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని, లేకుంటే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి మాదిగలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగి గురునాథ్, తలారి పరమేష్, బొడ్డు యాదయ్యమాదిగ, సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు కరుణశ్రీ రవీందర్, తలారి శ్రీకాంత్, సాగర్, కొమ్ము గణేష్, దాసరి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి వసతులు కరువు !



గట్టుప్పల్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

చండూరు : గట్టుప్పల మండలం కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో సిబ్బందికి సరైన గదులు, మౌలిక వసతులు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఏర్పాటైన గట్టుప్పల మండలానికి ఇటీవల మండల విద్యుత్ అధికారిని నియమించారు. ఉన్న గదులు ఆపరేటింగ్ సామగ్రితో నిండిపోయింది. ఏతఃకి కార్యాలయం లేకపోవడంతో సబ్ స్టేషన్ పక్కనే ఉన్న చెట్టు కింద విధులు నిర్వహించాల్సి వస్తోంది. రికార్డులు భద్రపరుచుకునేందుకు గదులు లేక ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

అసైన్డ్‌దారులకు న్యాయం జరిగేనా!

- లావుని పట్టా భూముల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు గతంలో నోటిఫికేషన్
- సర్వేను పలుమార్లు అడ్డుకున్న రైతులు
- కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



వెలిమినేడు గ్రామ శివారులో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేయబోయే భూములు (ఫైల్)

చిట్యాల: ఆ గ్రామ రైతులంతా వారసత్వంగా వచ్చిన అసైన్డ్ భూములనే తమ సర్వస్వంగా భావిస్తున్నారు. ఆ భూముల్లో పండించిన పంటలతో వచ్చిన ఆదాయంతోనే తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కానీ ఆ గ్రామంలో ఇండస్ట్రీయల్ పార్క్(పరిశ్రమల సెజ్) ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి సర్వే జరిపింది. దీంతో ఆ గ్రామ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇదీ చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామ రైతుల పరిస్థితి. కాగా అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. దీంతో ఆసైన్డ్‌దారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రభుత్వానికి నివేదిక అందజేత

వెలిమినేడు గ్రామ శివారులో ఉన్న అసైన్డ్ భూముల్లో ఇండస్ట్రీయల్ పార్క్(పరిశ్రమల సెజ్) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం భూముల సేకరణకు గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. వెలిమినేడు గ్రామ శివారులోని 348, 350, 351, 352, 354, 355, 358, 362, 363, 364, 365, 366, 368, 382, 383, 384, 396, 415 సర్వే నంబర్లలోని 116 మందికి చెందిన సుమారు 191 ఎకరాల్లో లావుని పట్టా భూముల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకుగాను భూ సేకరణ, పరిహారం అందించేందుకు ప్రకటన విడుదల చేసింది. అంతే కాకుండా వెలిమినేడు గ్రామంలో 418 సర్వే నంబర్‌లోని 123.30 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సర్వే నంబర్‌లో 60 ఎకరాల్లో ప్రభుత్వ భూములుండగా మరో 63 ఎకరాల్లో 64 మంది కి చెందిన పట్టదారు వ్యవసాయ భూములున్నాయి. ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు పలుమార్లు రెవెన్యూ, ల్యాండ్ సర్వేయర్ల అధికారులు చేపట్టిన సర్వేలను రైతులు గతంలో అడ్డుకున్నారు. అయినప్పటికీ సెలవు దినాల్లో రెవెన్యూ అధికారులు తమ దగ్గర ఉన్న రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే పూర్తి చేసి ఈ భూములన్నీ లావుని పట్టాలుగా గుర్తించి, పూర్తి వివరాలను గత ప్రభుత్వానికి అందజేశారు. కాగా ఈ భూముల్లో సుమారుగా వందకు పైగా ఎకరాలు 1958 తరువాత కాస్రా పహాణి పట్టా భూములుగా మార్చారు. కానీ రెవెన్యూ అధికారులు తమ ఆధీనంలో ఉన్న రికార్డుల ఆధారంగా ఈ భూములను లావుని పట్టా భూములుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. 396, 415, 418 సర్వే నంబర్లలో అసైన్డ్‌దారులకు ఎకరాకు రూ.15 లక్షల వరకు పరిహారం ఇచ్చేట్లుగా కొంతమంది అసైన్డ్‌దారుల చేత రెవెన్యూ అధికారులు ఆరు నెలల క్రితం ఒప్పంద పత్రాలపై సంతకాలు సేకరించారు. కానీ వారికి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందించలేదు.

దీక్షలు చేసిన రైతులు

జాతీయ రహదారికి అనుకుని ఉన్న వెలిమినేడు గ్రామ పరిధిలో ఉన్న భూములు ప్రస్తుతం ఎకరాకు బహిరంగ మార్కెట్‌లో కోటిన్నర నుంచి రెండు కోట్ల పైగా ధర ఉంది. ఇలాంటి భూములకు పదిహేను లక్షల రూపాయల పరిహారం ఇచ్చి భూసేకరణకు ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇన్నాళ్లు తమ భూములను రక్షించుకునేందుకు రైతులు పలు రాజకీయ పార్టీలు, సంస్థల సహకారంతో అనేక పోరాటాలు, నిరాహార దీక్షలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వమయినా తమను పట్టాదారులుగా గుర్తించి హక్కులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

భూములను స్వాధీనం చేసుకున్నారు



మా గ్రామ పరిధిలో ఇండస్ట్రీయల్ పార్క్‌ను ఏర్పాటు చేయవద్దంటూ మూడేళ్లుగా పోరాటం చేస్తున్నాం. అయినప్పటికీ 418, 396 సర్వే నంబర్‌లోని అసైన్డ్‌దారుల భూముల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు అధికారులు ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే గతంలో భూములను స్వాధీనం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు అసైన్డ్ భూములకు హక్కుదారులను గుర్తించి న్యాయం చేయాలి.

– అంశల సత్యనారాయణ, వెలిమినేడు

ఆదేశాలు రాలేదు



అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదేశాలిచ్చిన తరువాతనే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– దశరథ, చిట్యాల తహసీల్దార్

కాంగ్రెస్ పార్టీ గెలుపులో క్రైస్తవుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): కాంగ్రెస్ పార్టీ గెలుపులో క్రైస్తవుల పాత్ర కీలకమని తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం బేతనీయ చర్చిలో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని క్రైస్తవులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. చర్చి పాస్టర్ ప్రీతిప్రశాంత్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పాశం రాంరెడ్డి కృషి వల్లనే తిప్పర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. అనంతరం రాంరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల సంఘం అధ్యక్షుడు కత్తి డేవిడ్‌రాజు, కోశాధికారి ఎం.రవికుమార్, గౌరవ అధ్యక్షుడు ఎమ్.ఏసయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, జాకటి మోష, నలపరాజు శ్రీనివాస్, ఉయ్యాల నాగరాజు, పాస్టర్లు లాజరస్, జాన్, జక్కయ్య, సాల్మన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే భవిష్యత్ నిర్ణయం



మాట్లాడుతున్న పిల్లి రామరాజు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తన కార్యాచరణ అని, కార్యకర్తల అభీష్టం మేరకే భవిష్యత్ నిర్ణయం ఉంటుందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తాను ప్రజల మధ్యలోనే ఉంటానని, పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. ప్రతి గ్రామంలో సర్పంచ్, వార్డు మెంబర్‌లను నిలబెట్టి గెలిపించుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, పందుల సైదులు, పాల్వాయి రవి, అంతటి జ్యోతి, అల్లి వేణుయాదవ్, ఎంపీటీసీ సత్యవతి సుధాకర్‌రెడ్డి, జాన్‌రెడ్డి, నాగరాజుగౌడ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి

నార్కట్‌పల్లి : అయ్యప్ప ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహరిపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో 22వ మండల పడి పూజా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి అయ్యప్ప భక్తులు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్ని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన రమణ గురుస్వామి, ఆలయ అనువంశిక చైర్మన్ గురుస్వామి బెల్లి వెంకటేశ్వర్లు పడి పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, సర్పంచ్ దూదిమెట్ల స్రవంతివెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, భిక్షపతి, శ్యాంసుందర్‌రెడ్డి, భారత్, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, సంపత్, శివరాం, పుల్లెంల శ్రీనివాస్, శ్రీను, నర్సింహ, సైదులు, మోహన్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

చిట్యాల: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రకాల క్రీడల్లో రాణించాలని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి 67వ స్కూల్ గ్రేమ్స్‌లో భాగంగా చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో గురువారం చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులంతా క్రీడల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. జిల్లా స్థాయి చెస్ పోటీల్లో వివిధ పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, చెస్ అర్బిటర్ కె.కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వాసుదేవరావు, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, పీఎస్ హెచ్‌ఎం గోలి స్లీవమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ పోలెపల్లి సత్యనారాయణ, పీఈటీ రవీందర్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కార్యదర్శి బాదం భిక్షపతి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి శరత్, ఉపాధ్యాయులు మాధవి, రాధిక, రేవతి, పీఈటీ మోహన్‌రెడ్డి, కవిత, మంజుల, గఫార్, యాదయ్య, రాము పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



చండూరు : సమ్మె చేస్తున్న తపాలా సిబ్బంది

చండూరు : తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకుడు నవీన్‌కుమార్ తెలిపారు. ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్ కేంద్ర సంఘాల పిలుపు మేరకు గురువారం చండూరు తపాలా కార్యాలయం ఎదుట 3వ రోజు సమ్మె కొనసాగించారు. ఈసందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్ మంజూరు, 5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, తదితర డిమాండ్లను వెంటనే అమలు చేయాలన్నారు. సమ్మెలో ఈశ్వరయ్య, కావ్య, సునీత, సంతోష, క్రాంతి, సునీత, వినోద్‌కుమార్, లింగం, సైదాబీ, హాతిరాం, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మునుగోడులో..

మూడోరోజు కొనసాగిన సమ్మె

మునుగోడు: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం మూడోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా మునుగోడులోని పోస్టాఫీసు ఎదుట సిబ్బంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు సమ్మె విరమించబోమని అన్నారు. సమ్మెలో యూనియన్ మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, బి.నాగయ్య, జి.అరుణ, ఆర్.యాదగిరి, దుర్గాభవాని, బి.యాదయ్య, యూసుఫ్, ఎస్.దివ్య, రాధ, గణేష్, లావణ్య, సింధు, లహరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యాపారం కొనసాగించొద్దు



వ్యాపారులకు సూచనలు ఇస్తున్న అధికారులు

మునుగోడు: వారాంతపు సంత సందర్భంగా వ్యాపారులు తమ వస్తువులను రోడ్డుపై పెట్టి వ్యాపారాలు కొనసాగించవద్దని, అలా కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మునుగోడు ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం మునుగోడులో జరిగిన వారంతపు సంతలో పలువురు వ్యాపారులు మునుగోడు–నల్లగొండ ప్రధాన రహదారికి ఇరువైపులా వివిధ రకాల వస్తువులను పెట్టి విక్రయిస్తుండగా పంచాయతీ అధికారులతో కలిసి ఎస్‌ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా కూరగాయల వ్యాపారం కొనసాగిస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. పంచాయతీ అధికారులు సంతకు కేటాయించిన స్థలంలో వస్తువులను విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సుమలత, మునుగోడు పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులుదీరిన మహిళలు



మర్రిగూడలో గ్యాస్ ఏజెన్సీ ఎదుట మహిళలు

మర్రిగూడ: మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద గురువారం మహిళలు బారులుదీరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తామని చెప్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో మహిళలంతా గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూ కట్టారు. గ్యాస్ బుక్‌తోపాటు ఆధార్, రేషన్‌కార్డు వివరాలను నమోదు చేయించడానికి మహిళలు భారీగా వచ్చారు. గ్యాస్ కంపెనీ నుంచి కానీ, ప్రభుత్వం నుంచి కానీ సబ్సిడీకి సంబంధించి విధివిధానాలు రాలేదని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మహిళలకు చెప్పినప్పటికీ మహిళలు గ్యాస్ ఏజెన్సీ వద్దకు వస్తున్నారు. చేసేదేమి లేక ఏజెన్సీ నిర్వాహకులు వివరాలను నమోదు చేసుకుని పంపిస్తున్నారు.

గతుకుల రోడ్డుపై ప్రయాణించేదెలా !





బీటీ తేలిపోయి మట్టిరోడ్డును తలపిస్తున్న కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు

- అధ్వానంగా ఎరసానిగూడెం రోడ్డు
- బస్సు సర్వీసు నిలిపివేత
- ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు, విద్యార్థులు

కట్టంగూర్ : మండలంలోని ఎరసానిగూడెం గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి పై ఉన్న ఎరసానిగూడెం స్టేజీ వద్ద నుంచి మొదలుకొని గ్రామం వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. 2015 సంవత్సరంలో ఎమ్మెల్సీ నిధులతో నిర్మించిన రోడ్డు పట్టుమని పది సంవత్సరాలు నిండకుండానే ధ్వంసమై మట్టిరోడ్డుగా మారిపోయింది. కాంట్రాక్టర్ నాణ్యతాలోపంతో నిర్మించడంతో ఐదు సంవత్సరాలకే రోడ్డంతా గుంతలుగా మారింది. దీంతో ఈ రోడ్డు గుండా రాకపోకలు నిర్వహించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎరసానిగూడెం రోడ్డు వెంబడి పత్తి మిల్లు ఉండడంతో పత్తిని అమ్ముకునేందుకు వెళ్లే రైతులకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

గతంలో ఆర్టీసీ సేవలు..

జాతీయ రహదారి నుంచి ఎరసానిగూడెం గ్రామం వరకు 2015 సంత్సరంలో నూతనంగా రోడ్డు నిర్మించడంతో నల్లగొండ ఆర్టీసీ డిపో అధికారులు ఆర్డినరీ బస్సు సౌకర్యం కల్పించి ఐదు సంత్సరాల పాటు రాకపోకలు నిర్వహించారు. ఎరసానిగూడెం గ్రామం నుంచి పామనగుండ్ల, ఇస్మాయిల్‌పల్లి, పిట్టంపల్లి గ్రామాల మీదుగా నల్లగొండ వరకు బస్సు సౌకర్యం ఉండడంతో ఆయా గ్రామాల ప్రజల ఇబ్బంది తొలగిపోయింది. అనంతరం రోడ్డంతా గుంతలమయంగా ఏర్పడి ధ్వంసం కావడంతో బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు మూడు సంవత్సరాల క్రితమే నిలిపివేశారు. దీంతో ఉదయం సాయంత్రం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, నిత్యం ప్రయాణం చేసే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా తమకు ఉపయోగం లేకుండా పోయిందని ఆయా గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా చొరవ చూపి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



మా గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు నిర్మించిన రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకంగా మారింది. నాణ్యతా లోపంతో నిర్మించడంతో బీటీ రోడ్డు రూపురేఖలు పూర్తిగా మారి మట్టి రోడ్డును తలపిస్తుంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

– తరాల సత్యనారాయణ, ఎరసానిగూడెం

ఎంజీయూలో క్రిస్మస్ వేడుకలు



వేడుకలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గురువారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సామాజిక స్పృహకు క్రైస్తవులు ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రతిఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడవాలన్నారు. జీవితంపై స్పష్టత కలిగి ఉండాలని, విద్యార్థులు నిత్యం ఉత్సాహంగా ఉండాలని సూచించారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రావు, హాస్టల్ డైరెక్టర్ ప్రేమ్‌సాగర్, మధు, శ్యాంసుందర్, మహేష్, సుకీర్తన, నిస్సీ, హెబ్సిబా, స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.



యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌ను పరామర్శిస్తున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

క్రిస్మస్ సందడి ప్రారంభం



విద్యుత్ దీపాలతో క్లాక్ టవర్ సెంటర్‌లోని సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్ట్ చర్చి



క్రిస్మస్ ట్రీ లు



శాంతా క్లాజ్ ఫేస్ మాస్కులు



వివిధ రకాల క్రిస్మస్ గిఫ్టులు

క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మార్కెట్లో శాంతా క్లాజ్ బొమ్మలు, క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ కానుకలు, క్రిస్మస్ ట్రీ లు అమ్ముతున్నారు. క్రైస్తవులు తమ ఇళ్లల్లో క్రిస్మస్ ట్రీ, స్టార్‌లను అలంకరించుకుంటున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ